సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 13 । జూలై । 2023



మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా
పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న వంట ఏజెన్సీల కార్మికులు ధర్నా చేశారు. - 9లో



అండర్‌పాస్ పనుల పరిశీలన
భువనగిరిలోని అర్బన్ కాలనీలో రైల్వే అండర్ పాస్ పనులను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. - 9లో

గరిష్టం/కనిష్టం 33°/24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భువనగిరి ఏసీపీగా శేఖర్‌రెడ్డి

భువనగిరి : భువనగిరి ఏసీపీగా రావుల శేఖర్ రెడ్డిని నియమిస్తూ బుధవారం డీజీపీ అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సాయిరెడ్డి వెంకట్‌రెడ్డిని హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.

తప్పులు లేకుండా చదవాలి

భువనగిరి : తప్పులు లేకుండా చదవాలని డీఈఓ నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం బోధన, పఠనోత్సవంలో భాగంగా భువనగిరి మండలంలోని తుక్కాపురం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులచే పాఠాలు చదివించారు. విద్యార్థులు పఠనంపై మక్కువ పెంచుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం ఉన్నారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



ఆలేరులో లెక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆలేరురూరల్, భువనగిరి :ఆలేరు పట్టణంలోని మల్లికార్జున పారాబాయిల్డ్, భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరి శివారులో గల శివ పారాబాయిల్డ్ రైస్ మిల్లుల్లో బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీలు నిర్వహించారు. వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లులకు కేటాయించిన కస్టమ్ మిల్లింగ్ రైస్, ప్రభుత్వానికి ఎంత ఇచ్చారని తెలుసుకున్నారు. లక్ష్యం మేరకు సీఎంఆర్ అందజేయాలని మిల్లుల యజమానులను ఆదేశించారు. ఆమె వెంట సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



స్వామివారికి పూజలు చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, శ్రీస్వామి వారికి బాలభోగం, తర్వాత మూలవర్యులకు నిజాభిషేకం చేసి అలంకరించారు. అదే విధంగా శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవ నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

• పేటలో రాశిఖన్నా



సినీ నటి రాశిఖన్నా బుధవారం సూర్యాపేటలో మాంగల్య షాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. ఆమెను చూసేందుకు అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావడంతో షాపింగ్ మాల్ వద్ద కోలాహలం నెలకొంది.

నిరసన హోరు



ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం యాదగిరిగుట్టలో ఆయన ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఉచిత విద్యుత్ సరిగా ఇవ్వడం లేదంటూ చౌటుప్పల్‌లోని సబ్‌స్టేషన్ ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆక్రమిత భూమి పరిశీలన

మోత్కూరు : పట్టణ పరిధిలోని బిక్కేరు వాగు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణకు గురైన తొమ్మిది ఎకరాల భూమిని బుధవారం ఆర్ దాసరి శ్రీనివాస్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సర్వే నెం.1084లో 9 ఎకరాలు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు పాతగా ఆక్రమణదారులు తొలగించి సాగుకు సిద్ధం అయ్యారు. పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అట్టి స్థలాన్ని ఆర్ఐ సందర్శించారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా సాగు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రైతులు బోడ బాబురావు, గుంటి ఆనందం, గుంటి నర్సయ్య, గుంటి అయిలయ్య, చిట్టిమల్ల దేవయ్య తదితరులు ఉన్నారు.

ఈ రోడ్లు మారవా?

ముందుకు సాగని రహదారుల నిర్మాణం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- ఏళ్లు గడుస్తున్నా తాత్సారం
- కొన్నిచోట్ల మొదలే కాని పనులు
- నరకం చూస్తున్న ప్రయాణికులు



గుంతలు పడి వర్షానికి నీరు నిలిచిన గుండాల మండలం గంగాపురం రహదారి

సాక్షి, యాదాద్రి : జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఐదారు పనులకు సంబంధించి రూ.5కోట్ల నుంచి రూ.10 కోట్ల పనులపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులపై జనం నరకయాతన అనుభవిస్తున్నారు.

రోడ్ల దుస్థితి ఇలా..

- రామన్నపేట నుంచి జనంపల్లి, ఇస్కిళ్ల, కక్కిరేణి గ్రామాల మీదుగా ఎన్నారం వరకు 15.4 కి.మీ మేర చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. బీటీ రెన్యూవల్ కోసం 0/0 నుంచి 4 కి.మీ వరకు రూ.90లక్షలు, 4వ కి.మీ నుంచి 15.4 కి.మీ వరకు ప్రభుత్వం ఏడాది క్రితం రూ 2.35 కోట్లు మంజూరు చేసింది. పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.
- యాదగిరిగుట్ట నుంచి రాజాపేట వయా సింగారం వరకు 28.5 కి. మీ మేర మరమ్మతులకు ప్రభుత్వం రూ.8.20కోట్లు మంజూరు చేసింది. అగ్రిమెంట్ జరిగి సంవత్సరం గడిచినా పనులు మొదలు కాలేదు.
- ఆలేరు నుంచి మంతపురి గ్రామానికి 3 కి.మీ మేర బీటీ వేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.80లక్షలు మంజూరయ్యాయి. నెల రోజులు కావస్తున్నా అగ్రిమెంట్ కాలేదు.
- గుండాల మండలం గంగాపురం నుంచి జనగామ హైవే వరకు, సీతారాంపురం, నల్లగుండ్ల నుంచి వయా మరిపడిగ మీదుగా జనగామ రోడ్డు 7 కి.మీ ధ్వంసమైంది. ఏడాది క్రితం నిధులు మంజూరైనా టెండర్లు పూర్తి కావడం లేదు.
- వలిగొండ మండలం వెల్వర్తి నుంచి అరూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది.
- భూదాన్‌పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖ్ - పిల్లాయిపల్లి మధ్య రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.6కోట్లు మంజూరు చేసింది. మూడేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి.
- బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి - జూలూరు మధ్య రూ.4.05 కోట్ల వ్యయంతో చేపట్టిన హైలెవల్ వంతెన పనులు మధ్యలోనే నిపివేశారు.

వాహనాలు దెబ్బతింటున్నాయి



ఇస్కిళ్ల - జనంపల్లి మధ్య రోడ్డు అధ్వాన్నంగా ఉంది. బీటీ లేచి కంకర తేలింది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నాం. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఆటోలు, కార్ల యజమానులు కిరాయికి రావడానికి జంకుతున్నారు.

–మేడి యాదయ్య, ఇస్కిళ్ల, రామన్నపేట మండలం

త్వరలోనే పూర్తి చేస్తాం

రాయగిరి - మోత్కూరు మార్గంలో ఒక బిట్టు అగ్రిమెంట్ కావాలి. రుద్రవెల్లి బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. నదిలో సాయిల్‌టెస్ట్ చేశాం. రిపోర్టు రాగానే పనులు ప్రారంభిస్తాం. ఆలేరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెళ్లే రోడ్డు పనులను నాలుగైదు రోజుల్లో ప్రారంభిస్తాం.తుర్కపల్లి, యాదగిరిగుట్ట రోడ్డు పూర్తికాగానే కొలనుపాక రహదారి పనులు మెదలుపెడుతాం.

–శంకరయ్య, ఆర్అండ్‌బీ ఈఈ

మూడేళ్లుగా..



పోసానికుంట- కాటేపల్లి మార్గం ఇలా

ఆత్మకూరు (ఎం) మండలంలోని పోసానికుంట నుంచి కాటేపల్లి వరకు మూడేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరైంది. ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇంకా కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాటేపల్లి - ముత్తిరెడ్డిగూడెం మధ్య బ్రిడ్జిని అసంపూర్తిగా వదిలేశారు. అలాగే మోత్కూర్ నుంచి ఆత్మకూరు మధ్య మోత్కూరులో టెలిఫోన్ ఆఫీస్, రాజన్నగూడెం వద్ద, రహీంఖాన్ పేట, తుక్కాపురం స్టేజీ వద్ద రోడ్డు ధ్వంసమైంది.

మొదలుకాని పనులు



గుంతలమయంగా బొమ్మలరామారం - జలాల్‌పూర్ రోడ్డు

బొమ్మలరామారం మండలంలో రంగాపూర్ చెక్ పోస్ట్ నుంచి రామస్వామి తండా వరకు 10 కి.మీ మేర రోడ్డు మరమ్మతులకు టెండర్లు పూర్తయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. అదే విధంగా కాజీపేట చౌరస్తా నుంచి జలాల్‌పూర్ మీదుగా ఎర్రకుంట చౌరస్తా వరకు రోడ్డంతా అధ్వానంగా మారింది.

ఎన్నికల్లో పోటీ పక్కా..

- అసెంబ్లీ వైపు మోత్కుపల్లి చూపు
- ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని ప్రకటన
- ఇదే విషయం అధినేతకు స్పష్టం చేసిన మాజీ మంత్రి
- మోత్కుపల్లి తాజా ప్రకటనపై రాజకీయవర్గాల్లో చర్చ



సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే విషయాన్ని తన పుట్టిన రోజు సందర్భంగా యాదగిరిగుట్టలో ప్రకటించడంతో పాటు అధినేత కేసీఆర్‌ను కలిసి స్పష్టం చేశారు. మోత్కుపల్లి తాజా ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆలేరు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రభుత్వం దళితబంధు పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీజేపీని వీడి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పట్లో ఆయనకు దళితబంధు చైర్మన్ లేదా రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవి ఏదో ఒకటి వస్తుందని జోరుగా ప్రచారం సాగింది. సీఎం కేసీఆర్ సైతం సముచిత స్థానం కల్పిస్తానని మోత్కుపల్లికి హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఏడాది గడిచినా ఆయనకు ఎలాంటి పదవులు రాలేదు. అయినప్పటికీ నిరాశచెందకుండా అధినేత నిర్ణయం కోసం వేచిచూసే ధోరణి అవలంభిస్తున్నారు. అయితే క్రియాశీలక రాజకీయాలకు మాత్రం దూరంగా ఉంటున్నారు.

ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో మోత్కుపల్లి తన మనసులోని మాట బయటకు చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటానని ప్రకటించారు. అధినేత కేసీఆర్ అవకాశం ఇస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా బరిలోకి దిగుతానని ప్రకటన చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన మోత్కుపల్లి.. ఆలేరు నుంచి ఐదుసార్లు, తుంగతుర్తి నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ, కాంగ్రెస్ నుంచి, స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన ఆయనకు ఆలేరు నియోజకవర్గంలో బలమైన అనుచరగణం ఉంది. అయితే బీజేపీలో సామాజిక న్యాయం లేదని బీఆర్ఎస్‌లో చేరిన మోత్కుపల్లి నర్సింహులు క్రియాశీలకంగా నియోజకవర్గంలో ఏనాడూ పర్యటించలేదు. కొన్ని ప్రత్యేక కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతున్నారు.

ఇంటికి పరిమితం కాలేను
-మోత్కుపల్లి నర్సింహులు

నిత్యం ప్రజల మధ్య ఉండే తాను అనామకుని లా ఇంటికి పరిమితం కాలేను. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి పోటీ చేయమని అధినేత కేసీఆర్ అవకాశం ఇచ్చినా అక్కడి నుంచి రంగంలోకి దిగుతాను. నాకంటూ ప్రత్యేకమైన ఓటు బ్యాంకు ఉంది. కేసీఆర్ పిలుపుతో బీఆర్ఎస్‌లో చేరాను. ఆయన నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నా.

కాంగ్రెస్‌కు రైతులే గుణపాఠం చెబుతారు



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, చిత్రంలో ఎంపీ

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

చౌటుప్పల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి సరఫరా చేస్తున్న ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులే గుణపాఠం చెబుతారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ హెచ్చరించారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్, మండల అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, గిర్కటి నిరంజన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా సరిపోతుందంటూ మాట్లాడడం దుర్మార్గమన్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, మున్సి పల్, సింగిల్‌విండో చైర్మన్లు వెన్‌రెడ్డి రాజు, చింతల దామోదర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ కొత్త పర్వతాలు, గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేశం, నాయకులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, బీమిడి రాంరెడ్డి, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, బత్తుల స్వామి, సుర్కంటి శ్రీధర్‌రెడ్డి, తాడూరి పరమేష్, బొడిగె బాలకృష్ణ, పోలోజు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి, చిత్రంలో దూదిమెట్ల బాలరాజు యాదవ్

ఆత్మకూరు(ఎం) : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని, ఉచిత విద్యుత్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలతో నిరూపితమైందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, గోట్ అండ్ ఫిష్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎం)లో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. వ్యవసాయానికి మూడు గంటలు విద్యుత్ ఇస్తే సరిపోతుందని వాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. రేవంత్ వాఖ్యలకు నిరసనగా నేడు భువనగిరిలో చేపట్టనున్న మహానిరసనలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, నాయకులు బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కోరె భిక్షపతి, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, ఎంపీటీసీ యాస కవితాఇంద్రారెడ్డి, నాయకులు కోరె వెంకన్న, సోలిపురం అరుణ, ఎండీఅజీమోద్దీన్, మాద సత్తయ్య పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'ముస్కాన్'!

- వ్యాపార సంస్థలు, కర్మాగారాలు, ఇటుక బట్టీల్లో వందలాది మంది చిన్నారులు
- అధికారులు గుర్తిస్తున్నది పదుల సంఖ్యలోనే
- 1న మొదలైన ఆపరేషన్ ముస్కాన్



పరిశ్రమలో తనిఖీలకు వచ్చిన అధికారులు

భువనగిరి : బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడంతో పాటు బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ మొక్కుబడిగా సాగుతుందన్న విమర్శలున్నాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, ఇటుక బట్టీల్లో వందలాది మంది చిన్నారులు పనిచేస్తున్నా అధికారుల తనిఖీల్లో కొందరే వెలుగులోకి వస్తున్నారు. ప్రత్యేక ఏర్పాటు చేసిన బృందాలు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో ఎంతో మంది చిన్నారులు చదువుకు దూరం అవుతున్నారు.

తనిఖీలకు ప్రత్యేక బృందాలు

బడిబయటి బాలలను గుర్తించేందుకు బాలల సంక్షేమం, సంరక్షణ, కార్మిక, పోలీస్, వైద్య, రెవెన్యూ, విద్యా శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నెలరోజుల పాటు జిల్లాలోని ఇటుక బట్టీలు, బస్టాండ్లు, హోటళ్లు, దుకాణాలు, బేకరీలు, వ్యాపార సంస్థలు, భవన నిర్మాణ రంగం తదితర పని ప్రదేశాల్లో తనిఖీలు చేసి బాలలతో పాటు కార్మికులకు గుర్తించి విముక్తి కల్పిస్తారు. అంతేకాకుండా తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న చిన్నారులను చేరదీసి పాఠశాలలు, ఆర్సీసీ కేంద్రాల్లో చేర్పిస్తారు. కానీ, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో తనిఖీలు తూతూమంత్రంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఆరు విడతలు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుంచి ఏడో విడత ప్రారంభమైంది. ఏడో విడతలో కేవలం ఏడుగురికి మాత్రమే విముక్తి కల్పించారు ఇందులో ఆరుగురు బాలికలు, ఒక బాలుడు ఉన్నారు.

జరిమానాలతోనే సరి

చిన్నారులను పనిలో పెట్టుకున్న, హింసించిన, ప్రాథమిక హక్కులను కాలరాసిన వారిపై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. తీవ్రతను బట్టి జరిమానా, జైలు శిక్ష కూడా ఉంటుంది. ఆపరేషన్ ముస్కాన్ సమయంలో పిల్లలు పట్టుబడిన క్రమంలో ఆయా సంస్థల యాజమానులపై తీర్యలు తీసుకోవల్సి ఉండగా అధికారులు మెతకవైఖరి అవలంభిస్తున్నారన్న విమర్శలున్నాయి. కేవలం జరిమానా విధించి వదిలేస్తుండడంతో ఎప్పటి మాదిరిగానే యాజమానులు పిల్లలను పనిలో పెట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

ఏటీఎంలో చోరీకి యత్నం

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ ఫార్మా కంపెనీ పక్కన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చారు. అనంతరం ఏటీఎంలో నగదు నిల్వ చేసే బాక్స్‌ను తెరిచేందుకు యత్నించారు. అది రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. బుధవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఆలేరురూరల్: జీవితంపై విరక్తితో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలేరు శివారులో రైలు పట్టాలపై బుధవారం చోటుచేసుకుంది. భువనగిరి రైల్వే ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గూడెపు వెంకటేష్(33) గతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కొద్ది నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. అవివాహితుడైన వెంకటేష్ జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం ఆలేరు శివారులో రైలు పట్టాల వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకొని..

హుజూర్‌నగర్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హుజూర్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కుమ్మరికుంట్ల నాగేశ్వరరావు(50) గత కొన్నేళ్లుగా స్థానిక గాంధీ పార్క్ చౌరస్తాలో బజ్జీల బండి నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అతడు మద్యానికి బానిసై వ్యాపారం సరిగా చేయడం లేదు. దీంతో ఇంట్లో తరచూ భార్యాపిల్లలతో గొడవ పడుతుండేవాడు. మద్యం మానమని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినడం లేదు. కాగా బుధవారం భార్యాపిల్లలు షాపు వద్దకు వెళ్లగా.. నాగేశ్వరరావు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విపత్తుల నుంచి రక్షణ పొందడంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

రాజాపేట: వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా ఆత్మరక్షణ పొందాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బుధవారం రాజాపేట మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించింది. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల స్వరూప రామచంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి సంపత్, హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్ టవర్ల బ్యాటరీ దొంగల అరెస్ట్

- యాదగిరిగుట్టలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి నుంచి కారు, రూ.55వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్, వెనుక నిందితులు వినోద్, భానుప్రసాద్

యాదగిరిగుట్ట: జల్సాలకు అలవాటు పడి.. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో సెల్ టవర్ల వద్ద బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను బుధవారం యాదగిరిగుట్టలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.55వేల నగదుతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన మాదాసు వినోద్, మాదాసు భానుప్రసాద్ కొంతకాలంగా సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సెల్ టవర్లలో వినియోగించే విద్యుత్ బ్యాటరీలను దొంగిలించి హైదరాబాద్‌లో అమ్ముకుంటున్నారు. ఇటీవల కాలంలో యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఓ సెల్‌ఫోన్ టవర్ వద్ద సుమారు 16 బ్యాటరీలను దొంగిలించారు. దీంతో పట్టణ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లి చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో అటువైపు వెళ్తున్న మాదాసు వినోద్, మాదాసు భానుప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారి కారును తనిఖీ చేయగా అందులో దొంగతనానికి వినియోగించే పనిముట్లు కనిపించాయి. వాటి గురించి ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. సెల్ టవర్లలో ఉండే విద్యుత్ బ్యాటరీలను దొంగతనం చేసి హైదరాబాద్‌లో అమ్ముకుంటున్నట్లు నిజం ఒప్పుకున్నారు.

ఇప్పటి వరకు 89 బ్యాటరీలు చోరీ..

నిందితులు ఇద్దరు మోటకొండూర్ మండలంలో 24 బ్యాటరీలు, రాజాపేట మండలం సింగారంలో 17, బేగంపేటలో 16 బ్యాటరీలు, రంగారెడ్డి జిల్లా అబ్దులాపూర్‌మెట్‌లో 16 బ్యాటరీలు, యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో 16తో కలిపి మొత్తం 89 బ్యాటరీలు దొంగిలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. వారి నుంచి బ్యాటరీలు అమ్మగా వచ్చిన రూ.55వేల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. వీరికి సహకరించిన పరమేశ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రమేష్, కానిస్టేబుళ్లు లింగస్వామి, విజయ్, గోవింద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

46 మంది హిజ్రాల బైండోవర్



హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్ టౌన్ సీఐ రాఘవేందర్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం హిజ్రాలు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 46మంది హిజ్రాలను బాధ్యులు చేస్తూ వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వన్ టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపారు. వారందరికీ బుధవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ హిజ్రాలు డబ్బులు డిమాండ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హిజ్రాల వలన ప్రజలు ఇబ్బంది పడితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక ఆత్మహత్య

- నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు



స్వాతి (ఫైల్)

మిర్యాలగూడ: ప్రేమోన్మాది వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన దామరచర్ల మండంలోని గణేష్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. బుధవారం దామరచర్ల ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌పహాడ్ గ్రామానికి చెందిన కొర్ర రెడ్యా, విజయ దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. మూడో కుమార్తె కొర్ర స్వాతి(17) సూర్యాపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మెగావత్ హుస్సేన్ ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. హుస్సేన్ గత కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో స్వాతిని వేధిస్తున్నాడు. తరచూ ఫోన్లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని స్వాతి తన తల్లిదండ్రులకు చెప్పగా వారు హుస్సేన్‌ను మందలించారు. అయినా తీరు మారని హుస్సేన్ స్వాతిని ప్రేమ పేరుతో వేధించసాగాడు. దీంతో విసుగు చెందిన స్వాతి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయి గణేష్‌పహాడ్ గ్రామ పరిధిలో కృష్ణా నది ఒడ్డున గల పంప్‌హౌజ్ పైనుంచి కిందకు నదిలోకి దూకింది. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం కృష్ణా నదిలో స్వాతి మృతదేహం లభ్యమైంది. నిందితుడు హుస్సేన్ పరారీలో ఉన్నాడని, అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వాతి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ చేస్తూ పోలీసులకు చిక్కిన దొంగ

- యాదాద్రి ఆలయంలో మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించేందుకు యత్నం



ఎస్‌పీఎఫ్ పోలీసుల అదుపులో నిందితుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖ మండపంలో బుధవారం ఓ మహిళా భక్తురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును దొంగిలిస్తున్న వ్యక్తిని ఎస్‌పీఎఫ్ పోలీసులు, ఆలయ సురక్ష సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు. ఎస్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు తన భర్తతో కలిసి స్వామి వారిని సాయంత్రం 7గంటల సమయంలో దర్శించుకొని, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో ఆమె మెడలో నుంచి యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నరేష్ అనే వ్యక్తి సుమారు 3తులాల బంగారు పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించాడు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ సురక్ష సిబ్బంది గుర్తించి ఎస్‌పీఎఫ్ పోలీసులకు చెప్పడంతో వెంటనే వారు అక్కడి చేరుకొని నరేష్‌ను పట్టుకొని బయటకు తీసుకెళ్లి విచారించగా.. భక్తురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించానని ఒప్పుకున్నాడు. అంతేకాకుండా మధ్యాహ్నం ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించానని, అది జేబులో వేసుకుంటే ఎక్కడో పడిపోయిందని ఎస్‌పీఎఫ్ పోలీసులకు నిందితుడు వివరించాడు. ఎస్‌పీఎఫ్ ఏఎస్‌ఐలు రాజు, రాజయ్య, కానిస్టేబుళ్లు పట్టుబడిన దొంగను యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్‌కు అప్పగించారు.

దుర్భరస్థితిలో ప్రభుత్వ హాస్టళ్లు



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

భువనగిరి: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు దుర్భర స్థితిలో ఉన్నాయని ఏబీవీపీ హాస్టల్స్ విభాగం రాష్ట్ర కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్స్, గురుకులాలు.. జైళ్ల కన్నాఅధ్వానంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోగా మెస్ చార్జీలు పెంచడం లేదన్నారు. సన్న బియ్యం అందించకపోవడం వల్ల విద్యార్థులు భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. శిథిలావ్యవస్థలో ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీల హాస్టల్స్‌కు నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోడ బుచ్చిబాబు, నల్లగొండ విభాగ్ ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ సామల సాయికుమార్, నాయకులు సాయికిరణ్, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

కుక్కల కళేబరాలకు పోస్టుమార్టం



పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

వలిగొండ: మండలంలోని ఆరూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మత్స్యగిరి గుట్ట వద్ద శనివారం గుర్తుతెలియని వ్యక్తులు కుక్కలకు విషాహారం ఇచ్చి చంపి, గ్రామం పక్కన గోతిలో పాతిపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఆరూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం తహసీల్దార్ గణేష్‌నాయక్, ఎస్‌ఐ ప్రభాకర్, పశువైద్యాధికారులు రాంమోహన్‌రెడ్డి, సంధ్య, సిబ్బంది కలిసి కుక్కలను పాతిన గుంతను జేసీబీతో తవ్వి కుక్కల కళేబరాలను బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. వాటి అవయవాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

నలుగురు బాలకార్మికులకు విముక్తి

నకిరేకల్: పట్టణంలోని వివిధ షాపుల్లో బాలకార్మికులతో పనిచేయిస్తున్నారన్న సమాచారంతో నల్లగొండ ఆపరేషన్ ముస్కాన్ టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ పి. శంకరయ్య ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు బాలకార్మికులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు బాలకార్మికులను పనిలో పెట్టుకున్న షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు.

రైస్ మిల్లులో హమాలీ మృతి



అమిత్‌కుమార్ మృతదేహం

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల సాయిబాలాజీ రైస్‌మిల్లులో బుధవారం ప్రమాదవశాత్తు డ్రైఎలివేటర్ పుల్లి ఊడి మీదపడటంతో బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీ మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం పూర్ణియా జిల్లా బన్‌వంకి గ్రామం హనుమాన్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు బిక్కి కుమార్, బిక్కి అమిత్‌కుమార్(21) శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని సాయిబాలాజీ రైస్‌మిల్లులో తొమ్మిది నెలలుగా హమాలీ పనిచేస్తున్నారు. రోజుమాదిరిగా మంగళవారం సాయంత్రం అమిత్ కుమార్ మిల్లుకు వెళ్లాడు. అతడు పనిలో ఉండగా అర్ధరాత్రి దాటిన తర్వాత ప్లాంట్ సెక్షన్‌లో డ్రైఎలివేటర్ పైన ఉన్న పుల్లి ఊడిపోయి అమిత్‌కుమార్ తలపై పడింది. దీంతో అతడి తలకు తీవ్రగాయం కాగా, అక్కడే ఉన్న హమాలీ మేస్త్రీ చెంచల్‌కుమార్ 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే అమిత్‌కుమార్ మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి అన్న బిక్కి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ పైనుంచి పడి యువకుడి దుర్మరణం

చండూరు(గట్టుప్పల్): బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందిన ఘటన గట్టుప్పల్ శివారులోని పుట్టపాక రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని తంగెడుపల్లి గ్రామానికి చెందిన ఆకిటి గణేష్(22) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం చండూరు మండలంలోని అంతంపేట గ్రామంలో తన స్నేహితులను కలిసేందుకు వచ్చి రాత్రి తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. రాత్రి 11గంటల సమయంలో గట్టుప్పల్ శివారులోని పుట్టపాక రోడ్డులో గుంతలను గమనించకపోవడంతో బైక్‌పై నుంచి అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు గమనించి ఘటనా స్థలంలో దొరికిన మృతుడి ఫోన్ ద్వారా అతడి బంధువులకు సమాచారం అందించారు. బుధవారం మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి : క్రీడా పాఠశాలల్లో 4,5వ తరగతిలో ప్రవేశాల కోసం బుధవారం భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 17 మండలాల నుంచి 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొమ్మిది విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతి కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్టాలిన్‌బాబు, మెడికల్ ఆఫీసర్ సాయిచంద్, వ్యాయామ ఉపాధ్యాయులు బాలకృష్ణ, వెంకటరమణ, కృష్ణమూర్తి, గోపాల్, చంఫీదాస్, దశరథరెడ్డి, శేఖర్, నాగరాజు, నరసింహ, మంజుల, సంగీత, సుజాత, రమేష్‌రెడ్డి, చంద్రమౌళి, మధుసూదన్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో మాంగళ్య షాపింగ్‌మాల్ ప్రారంభం



మాంగళ్య షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ రవీందర్‌రావు



పట్టుచీరను చూపిస్తున్న సినీ హీరోయిన్ రాశి ఖన్నా చిత్రంలో కాసం నమశ్శివాయ

- సందడి చేసిన సినీ హీరోయిన్ రాశి ఖన్నా

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్‌మాల్‌ను బుధవారం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ హీరోయిన్ రాశి ఖన్నా హాజరై సందడి చేశారు. రాశి ఖన్నాను చూడటానికి అభిమానులు, పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరికొత్త నూతన వస్త్ర ప్రపంచం నేడు సూర్యాపేట పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. అతి తక్కువ ధరలకే మాంగళ్య షాపింగ్ మాల్‌లో షాపింగ్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు పీఎన్ మూర్తి, పుల్లూరు అరుణ్, కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కేదారీనాథ్, శివప్రసాద్, తోడుపునూరు కార్తీక్, అరుణ్, కొల్లూరు వరుణ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ హీరోయిన్ రాశి ఖన్నా

'అన్ని రంగాల్లో మాలలకు అన్యాయం'

మిర్యాలగూడ టౌన్: అన్ని రంగాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణాలో మాలలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన దళిత బంధు పథకానికి మాలలు, మాదిగలకు సమాన నిష్పత్తిలో ఎంపిక చేయాలని కోరారు. మాలలందరూ రాజకీయాలకతీతంగా ఒకే వేదిక పైకి వచ్చి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడిగా మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన మీసాల జగదీష్‌ను నియమించారు. అనంతరం ఆయనకు తాళ్లపల్లి రవి నియామక పత్రం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాడుగుల శ్రీనివాస్, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పని నగేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గండమళ్ల జానయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూతం అర్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగటి జోసఫ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, మీసాల దేవేందర్ తదితరులున్నారు.

మత్స్య కార్మికుల అభ్యున్నతికి కృషి



గొంగిడి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మత్స్య పారిశ్రామిక సంఘం ప్రతినిధులు

యాదగిరిగుట్ట, చౌటుప్పల్: తెలంగాణలో మత్స్యకారుల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్‌బాబు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆ సంఘం పాలకవర్గం సభ్యులు యాదగిరిగుట్టలో బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్లు వాకిటి కృష్ణ, బోయిని ఝాన్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పెంట నర్సింహ, జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొలుపుల హరినాథ్, జిల్లా కార్యదర్శి పల్లెపాటి బాలయ్య, యాదగిరిగుట్ట మండలం అధ్యక్షుడు వెంకటేష్, భత్యం బాలరాజు, రాజాపేట మండల అధ్యక్షుడు బాలరాజు, వివిధ మండలాల సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నేడు ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలేరు రూరల్: ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో గురువారం స్థానిక ఏఎస్‌ఆర్ గార్డెన్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొంగిడి సునీత తెలిపారు. బుధవారం ఆమె ఆలేరులోని తన క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరవుతారన్నారు. పాల శీతలీకరణ కేంద్రం నుంచి భారీ ప్రదర్శన ఉంటుందన్నారు.

సమ్మెలో కార్మికులు.. పల్లె పనుల్లో సర్పంచ్‌లు



నార్కట్‌పల్లి : చౌడంపల్లిలో చెత్త సేకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్



ఆత్మకూరు(ఎం)లో గేట్ వాల్వ్ తిప్పుతున్న సర్పంచ్ జన్నాయికోడె నగేష్

ఆత్మకూరు(ఎం), నార్కట్‌పల్లి : వారం రోజుల నుంచి గ్రామపంచాయతీల కార్మికులు సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇతర పనులు కూడా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆత్మకూరు (ఎం) సర్పంచ్ జన్నాయికోడె నగేష్ గ్రామానికి తాగునీరు సరఫరా చేసేందుకు స్వయంగా గేట్ వాల్వ్‌లు తిప్పారు. ఇదే మండలం కప్రాయపల్లి సర్పంచ్ భర్త సామ శ్రీనివాసరెడ్డి, అలాగే నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి సర్పంచ్ దుబ్బ మధు, ఉప సర్పంచ్ దామర ఉదయ్‌కుమార్ ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాల్లో చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో గ్రామంలో చెత్త పేరుకుపోయిందని, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా విద్యా సంస్థల బంద్



భువనగిరిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

భువనగిరి : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. భువనగిరిలో విద్యార్థి సంఘాల నాయకులు అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై 40 రోజులు గడిచినా పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు కూడా విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఈర్ల రాహుల్, చింతల శివ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అభిలాష్, నాయకులు కార్తీక్, శివ, సాయికిరణ్, వినయ్, అజయ్, వెంకటేష్, సందీప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.